# శ్రుతిమించి రాగాన...

పైడిపాటి సుబ్బరామ శాస్త్రి

రుక్మమ్మ సింగమ్మ మీద విఱుచుకుపడి, తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టి పోస్తోంది.

సింగమ్మ కూడా ఏ మాత్రమూ తగ్గకుండా, రుక్మమ్మను విసిరి విసిరి కొడుతోంది, తిట్లతో.

ఇద్దఱూ ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ ఉంటే, తీర్చేవారు ఎవరూ ఇంట్లో ఉన్నట్లుగా లేదు.

దారేపోయే రామానికి ఈ తిట్లు విన్పించి సింగమ్మ యింటి వైపుకు వెళ్ళాడు. నిజంగానే యింట్లో మగ పురుగు లేదు– అదుపులో పెట్టేందుకు.

"చూడండి! మీరు పెద్ద మనుష్యులు! న్యాయం చెప్పండి! ఈ రుక్కి నా యింటి మీదికి వచ్చి తగాదా ఆడడం ఏమయినా బాగుందా? ఒక్కటే అల్లరీ, ఆగమూ చేస్తోంది. మేము గుట్టుగా బ్రదికే వాళ్ళంకదా!" అంది, సింగమ్మ.

"ఏమమ్మా! ఆమె యింటికి వచ్చి ఆమెను తిట్టవలసిన కారణం ఏమి వచ్చింది?" అన్నాడు, రాఘం, రుక్మమ్మతో.

"అకారణంగా ఎవరయినా తిడతారా?"

"తిట్టరు!"

"తిట్టాను అంటె కారణం ఉండి ఉండాలి."

"ఉండాలి! అదే నేను చెప్పమనేది!" అన్నాడు, రామం.

"చెబితే మీరేమయినా, ఆరుస్తారా? తీరుస్తారా?"

"ప్రయత్నిస్తాను."

"అయితే, వినండి! వ్రత కథల్లో పార్వతీ పరమేశ్వర్లు, ఆర్చేవారమూ మేమే, తీర్చే వారమూ మేమే అంటూ వస్తారు! అల్లా వచ్చారు మీరు!"

"అనుకో!"



"అనుకుంటే సరిపోయిందా? ఆ పార్వతీ పరమేశ్వరుల్లు బాధలు తీర్చేవారు."

"ప్రయత్నిస్తా నన్నానుగా!"

"సరే! ఒప్పుకున్నాను. ఈ సింగి ఉన్నదే, వట్టి చెడిపె!"

"ఏమిటి? ఏ మంటున్నావే రుక్కీ!"

"ఊరుకో అమ్మా! నువ్వు ఊరుకో! చెప్పని!" అన్నాడు, రామం.

"అల్లా వాటిడు గడ్డి నోట్లో పెట్టండి!"

"నీకే పెడతారు!" అంది సింగమ్మ.

"ఎవరికి పెట్టడానికి, నా దగ్గఱ గడ్డి లేదు కాని– రుక్కమ్మా! ఎందుకు వృధాగా ఆమెను నిందిస్తావు? ఇద్దఱ తగాదాకూ కారణం ఏమిటి?"

"నోటితో చెప్పాలా? పెద్ద మనుష్యులు అడిగారు కనుక చెబుతాను. నా మొగుడిని వలలో వేసుకొని ఇది కులుకుతోంది."

"రుక్కీ! అది, ఇది! అంటే, పళ్ళు రాలిపోతాయి! నేను నీకేమయినా దాసినా? దాసీలనే ఈ రోజులలో అంటే ఎవ్వరూ ఊరుకోరు!" అన్నది సింగమ్మ.

"నా మొగుడు ఎప్పుడో కాని, యింటికి రాడండి! సంపాదన అంతా దీని మొహానే పెడుతున్నాడు. నేనూ నా పిల్లలూ ఏమి కావాలి? ఇప్పుడు చెప్పండి మీ తీర్పు ఏమిటో!" అంది, రుక్కమ్మ.

"నిజమేనా?" అన్నాడు, రామం, సింగమ్మ వంకకు చూసి.

"నా యింటికి వచ్చిన వాళ్ళను అమర్యాదగా వెళ్ళిపొమ్మనడం నా చేతకాదు!" అన్నది, సింగమ్మ, తాపీగా.

"ఇంట్లో మగవాళ్ళున్నట్టు లేదు. నీకు మొగుడున్నాడా?" అన్నాడు, రామం.

"ముఖాన యాభై పైసల నాణెమంత బొట్టు ఉంటే, నీకు మొగుడున్నాడా– అని, అడుగుతావేమి పెద్ద మనిషి వయ్యా! నీ కళ్ళ కేమయినా చుక్కలు వచ్చినయ్యా?" అంది, సింగమ్మ.

"దాని మొగుడు ఒక మొద్దు! ఒక చవట!"

"అయితే, మొగుడున్నా డన్న మాట!" అన్నాడు, రామం.

"ఒసే, రుక్కీ! నా మొగుడుని నీవేమన్నా ఊరుకోను! తెలిసిందా? నీ మొగుణ్ణి నేను పల్లెత్తు మాట అన్నానా?" అన్నది, సింగమ్మ.

"ఎందుకంటావు? ప్రియుడుగా! అంటే, రేపు దగ్గఱకు రాడనీ, ఇల్లంతా దోచి పెట్టడనీ అనవు!" అంది, రుక్కమ్మ.

"పెద్ద మనుష్యులు! చెప్పండి! నా మొగుడు నేను చెప్పినట్లు వినేవాడయితే అదేమయినా నేరమా? అంత మాత్రంలో మొద్దు, చవట, అవుతాడా? పెళ్ళాం చెప్పినట్టు మొగుడు నడుచుకో కూడదా?

ఆడది, మగవాడు, సమానంగా పుట్టలేదా? ఎప్పుడూ మగవాడు చెప్పినట్లే ఆడది నడుచుకోవాలా? ఆడది చెప్పినట్లు మగవాడు నడుచుకో కూడదా?"

"కూడదని ఎవరంటారు!" అని, నసిగాడు రామం.

"అల్లా దారికి రండి!" అన్నది, సింగమ్మ.

"ఆయన దారిలోనే ఉన్నాడు. నువ్వే దారి తప్పిస్తున్నావు. ఏమండి! తప్పుడుదారిని ఆడది నడుస్తూ, మొగుణ్ణి దద్దమ్మను చేసి కూర్చొ పెట్టడం న్యాయమంటారా?" అన్నది, రుక్కమ్మ.

"మెడకాయ మీద తలకాయ ఉన్నవా డెవ్వడూ. అల్లా అనడు!" అన్నాడు రామం.

"అల్లా అనడు కదా! ఇప్పుడు చెప్పండి! దీనిది కుక్కబుద్ధి! నా మొగుణ్ణి ఇది ఇంటి చుట్టూ త్రిప్పుకొంటోంది– తనకు ఒక తాళి కట్టిన మొగుడుండగా!"

"ఏమమ్మా! నిజమేనా?" అన్నాడు, రామం.

"అసలు, నా వాకిట్లోకి రావడానికి నీకు అవసరమేమిటి?" అన్నది, సింగమ్మ రుక్కమ్మతో, రామం ప్రశ్నకు సమాధానం చెప్పకుండా.

"నువ్వు చేసిన పనికి, నీకు బడితె పూజ చేయడానికే వచ్చాను" అన్నది, రుక్కమ్మ ధీమాగా.

"చెప్పు దెబ్బలు తినిపోతావు! నాది కుక్క బుద్ధి అంటావా? నీ మొగుడే బందిపోటు కుక్క! నీ కుక్కను, నువ్వు కట్టి వేసుకోవడం, చేతకాక, నా మీదపడి ఏడుస్తావేం?" అంది, సింగమ్మ, ముఖం మొటమొట లాడించి.

"అంతా అర్థ మయింది!" అని, రామం, అది నిలువ దగిన చోటు కాదని, వెళ్ళి పోవడానికి సిద్ధమవుతున్నాడు.

"ఏమి పెద్ద మనిషివయ్యా! తీర్పు చెప్పడానికి చేతకాని వాడవు, మా యిద్దఱ మధ్యకూ, తగుదునమ్మా– అని ఎందుకు వచ్చావు? నువ్వు కదలడానికి వీలు లేదు. తీర్పు చెప్పి మఱీ కదులు!" అని, రుక్కమ్మ గద్దించింది.

రామం వణికి పోయాడు.

"బుద్ధిలేక వచ్చాడు. బుద్ధి కలిగి వెళ్ళిపోతున్నాడు. ఆయనను నువ్వు ఎలా కదలనియ్యవో నేను చూస్తా!" అంటూ, సింగమ్మ పచ్చడిబండ పట్టుకు వచ్చి నిలబడి, "ఇక వెళ్ళవయ్యా!" అన్నది.

"వెళ్ళడానికి వీలు లేదు. నీ తీర్పు చెప్పి మరి వెళ్ళు!" అని, రుక్కమ్మ రామం చెయి గట్టిగా పట్టుకుంది.

సింగమ్మ పచ్చడి బండతో, రుక్కమ్మ చేతిమీద కొట్టింది.

"అమ్మో, అమ్మో! దీని అఘాయిత్యం మండిపోను! నన్నే కొడుతుందిగా!" అని, కాసె బిగించి, పచ్చడి బండ లాక్కుని, సింగమ్మ మెడ మీద ఒక పెట్టు పెట్టింది. సింగమ్మ దిమ్మెక్కి పోయి కూలబడి తిట్టడం ప్రారంభించింది.

ఇదే సమయమని, రామం చల్లగా జాఱుకొని, వీధిలోకి వెళ్ళి జనంలో కలిసి పోయాడు. కొంతసేపటికి సింగమ్మ మొగుడు వచ్చి పెళ్ళాము మెడకు కాపు కాయడం ప్రారంభించాడు. మఱీ కొంతసేపటికి రుక్కమ్మ మొగుడు వచ్చి రుక్కమ్మ చెంప ఛెళ్ళుమనిపించి, యింటికి తీసుకు పోయాడు. □



# అప్పు

ఎప్పుడిచ్చినాడొ? ఏ పద్దు లేకుండ
కుబేరు డిచ్చెనంట కోట్ల ధనము!
అప్పు తీర్చకుండ ఆ కిరిటమ్మేల?
దేవ కలియుగేశ! తిరుమలేశ!

ఎంత తెచ్చినావొ? ఎందుకు? అన్నకు?
చెప్పవైతివయ్య? చిన్న తనమ!
మోజులొ కరి పైన మోత యింకొకరికా?
దేవకలియుగేశ! తిరుమలేశ!

కొలిచి కొలిచి ధనము కుంచమ్ముతో కొల్చి
అప్పు తీర్చదలచె అన్నగారు!
అప్పు తీరదాయె! అపనింద తనదాయె!
దేవ కలియుగేశ! తిరుమలేశ!

అప్పు చేయవచ్చు అవసరమున్నచో
పేదలైన ఉన్నపెద్దలైన!
తీర్చునపుడు చూడ తిరులే ఈ తీరు!
దేవ కలియుగేశ! తిరుమలేశ!

వడ్డికాసులనుచు వడ్డికి వడ్డిని
గుంజుకొనుట తమకు గుర్తు రాదు!
తెచ్చుకొనగజోరు! తీర్చమంటే పోరు!
దేవ కలియుగేశ! తిరుమలేశ!

మణులు పొదిగినట్టి మణుగుల బంగారు
మోతలుండ అప్పు మోతలేల?
అప్పు చేసి తినెడు పప్పుకూడే తప్పు!
దేవ కలియుగేశ! తిరుమలేశ!

దొడ్డ దొరలబుద్ధి దొడ్డిదారుల పడి
రాజ్యమేలుచుండ రమ్యగతుల
పుట్టదయ్య అప్పు పుట్టించిన వాడికో!
దేవ కలియుగేశ! తిరుమలేశ!

–పులికంటి కృష్ణారెడ్డి